


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -34-

**(07 ' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"ఈ కాలంలో ప్రతిక్షణం భగవంతుడు కనిపిస్తాడు. అనుకోకుండా మనస్సులు భగవంతునివైపు మరలుతున్నాయి. అంతకన్నా మార్గం కనిపించక 'ఆయనే దిక్కు' అనుకోవడం సంభవిస్తోంది. ఆయనగారిని ఈనాడు తలచుకున్నంతమంది ఏనాడూ తలచుకుని వుండరు. ఇన్ని అర్జీలు ఎప్పుడూ ఆయనకు అంది వుండవు" అన్నాడు మొన్న ఒకాయన.

"వెడుతున్నాయి సరే ఆ ఫైల్సు విప్పుతున్నాడా అని. గుట్టలు గుట్టలుగా పెరిగివుంటాయి ఈ పాటికి. లేకపోతే పరధ్యానంగా ప్రక్కన పెడితే ఆ పాలకడలిలో పడి కొట్టుకుపోతున్నాయేమో" అన్నాడు అది విన్న మరో పెద్ద మనిషి.

నిజానికి ఆయనగారికి ఎన్ని రకాల అర్జీలు, ఎన్ని విన్నపాలు. రైలు ఆలస్యంగా వచ్చినా "హే భగవాన్ ఏమిటి శిక్ష. ఎక్కడ ఆపావు రైలు. త్వరగా పంపించి పుణ్యం కట్టుకోస్వామీ" అని ఆయనకే విజ్ఞప్తి చేయడం.

తీరా రైలు వచ్చిన తర్వాత అందులో ఎక్కడానికి చోటు దొరక్క నానా అవస్థలు పడి, శరీరాన్ని మూట కట్టి అందులో పారేసి, ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరై "హే పరమాత్మ! ఏమిటీ పరీక్ష ఇల్లు కదిలినందుకా ఈ ప్రాయశ్చిత్తం. ప్రాణాయామ విద్య నేర్చుకోకుండా రైలు ప్రయాణం తలపెట్టడం నాదే తప్పు. ఈసారికి కాపాడు కరుణామయా! గమ్యం చేర్చు గజరాజ వరదా" అని ఆయన్ని తలచి ప్రార్థించడం అంతకన్నా తప్పడంలేదు.

నందాగారు టిక్కెట్టు పెంచారని పత్రికలో పడగానే ఒకాయన ఇలా అంటున్నాడు "ప్రభూ ప్రభుత్వానికేనా లక్ష్మీ ప్రసన్నం. మామీద యింత తూష్ణీభావమా స్వామీ. ఎప్పుడోగానీ కొంచెం చేతులోకి రాదు సిరి. అది విరజిమ్మి కూర్చోమా. సిరిలేని బరువు జీవితాలు గడపలేకుండా వున్నామయ్యా మధుసూదనా."

"సిరిని అందరికీ సమానంగా పంచుతామంటోంది ప్రభుత్వం పంచేదాకా ఆగకుండా వున్న సిరిని త్రుంచుకుంటోంది. ఎలాగయ్యా జీవించేది? సిరిని చూస్తేగానీ ఎదుటివాడికి చిరునవ్వు రావడంలా. మానవుడు మానవుడుగా కనిపించడంలా. నిజం చెప్పాలంటే సిరికోసం పడే తాపత్రయంలో నిన్ను మరచిపోతోంది మానవకోటి. సిరి విలువ తగ్గించి, నీ పరువు కాపాడుకోవా పంకజనాభా" అని కొందరు భక్తులు విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఇటీవల మా యింట్లో పదిమంది భక్తులు చేరి, కొంతసేపు భగవంతుని గురించి చెప్పుకున్నారు. మానవ జీవితం క్షణికమైనదనుకున్నారు. ఈ విషయాలు విన్న మా పనిచేసే అమ్మాయి వెంటనే అంది.

"ఈ రోజుల్లో భక్తి ప్రాకిపోతోంది ఇంటింటా. వెనుకటికి మల్లేకాదు. దేవుణ్ణి తలచుకోందే మనస్సు వూరుకోవడంలేదు. నేనే యింటికి వెళ్ళినా అంట్లు కన్నా ముందు హారతి పళ్ళాలు, కుందులు తోమమని గిరాటేస్తున్నారు. నాకిది ఒకరకంగా పుణ్యమే కదా అనుకుని నవ్వుతూ తోముతున్నాను" అంది.

"నిజమే మరి భగవంతుణ్ణి తలవందే ఏపనీ కావడంలేదు. 'ఇంట్లోనుంచి బయటికి పోతూ తిరిగి రప్పించే బాధ్యత నీదే స్వామీ' అని చెప్పుకోవల్సి వస్తోంది. భర్తలు పొరుగూరికి బయలుదేరి వెళ్ళినప్పటినుంచీ భార్యలు గంట గంటకూ మంగళసూత్రాలు తీసి చూసుకోవలసి వస్తోంది. కాలం అలా వుంది" అని ఒకామె వ్యాఖ్యానించింది.

"అందాకా ఎందుకు (మనం పడుతున్న తిప్పలు ఎన్ని చెప్పుకుంటే తీరతాయి చెప్పండి 'ఒకటి వుందనా, ఒకటి లేదనా' ఏది వుండటంలా) ప్రతి వస్తువా పరమైపోయిందనుకోండి. నిత్య కరువులో మరి వస్తువు వరం కానషం చేస్తుంది. "

"ప్రతిరోజూ చెంబులు తోమడానికి గిరాటు వేసేటంత చింతపండు వారం రోజులు వాడుకోవలసి వస్తోంది. పాపం మా వారికి పులుసంటే యిష్టం. చిన్నప్పుడు ఇష్టమొచ్చినట్లు దప్పళం వేయించుకుని త్రాగేవారుట. పులుసు పేరు చెపితే పొంగిపోతారు. అలాంటిది ఈ చింతపండు కరువులో చిక్కటి పులుసెలా వస్తుంది. ఆయన మట్టుకన్నా కాద్దామని కొంచెం పలచగా చేసి పోస్తే 'ఇదేమిటే ఇల్లాలా చారూ పులుసూ ఒకటిగానే వుంటున్నాయి. పేర్లు మార్చేగాని? ' అంటున్నారు. ఏం చేస్తాం చెప్పండి. చింతపండు వుండ హల్వా వుండతో సమానమైపోయింది."

ఇలా సంసారాలు చేసి అవస్థపడలేరనే సంతాన నిరోధం పెట్టారు. కొంతవరకైనా కొట్లాట తగ్గుతుందని. మిరపకాయల సంగతి (పోరగా పోరగా మొన్న రెండు వందల గ్రాముల మిరపకాయలు తెచ్చారు. ఎందుకు సరిపోతాయి? ముంత పొగ పెట్టడానికి తప్ప) అని ఆవిడ నైరాశ్యం వెలిబుచ్చింది.

"ఆ ఈశ్వరుడు ఇన్ని యిబ్బందులెందుకు కల్పిస్తున్నాడంటావు?" అని మరో ఆవిడ ప్రశ్నించింది.

"ఎందుకేమిటమ్మా కలికాలం. బయట కరువూ కాటకాలూ, మనుషుల్లో బూటకాలూ, నాటకాలూ.. ఆయనకు మటుకు తీరుబడి వుండొద్దు. ఇన్ని సమస్యలు ఆలోచించాలంటే ఇంకా నయం మనం అదృష్టవంతులం. ఇంకో వందేళ్ళ తర్వాత పుడితే కొంపల్లో కాపురాలు చేసే అవకాశాలు లేక నడిరోడ్డు మీద నాట్యం చేయాల్సి వచ్చేది" అన్నది రెండో ఆమె.

"ఇలా ఏదో విధంగా భగవంతుని ప్రార్థించడం తప్పడంలేదు. పూర్వంలాగా ఇప్పుడు అప్పులు కూడా ఎవరూ ఇవ్వడంలేదు. ఫస్టు తారీఖు రాగానే ఇస్తానయ్యా అంటే.

ఫస్టుతారీకు నాటికి నువ్వుంటావని గ్యారంటీ ఏమిటి (నేనుంటానని నమ్మకమేమిటి) సాయంత్రం మాటే హామీ లేదు. మొన్న ఒకాయన కాఫీగ్లాసు చేతులోనే వుందిట. కళ్ళు మూసేశాడుట. గుండెజబ్బులు. ఎంతసేపు?" అని ఉపన్యాసమిస్తున్నారు.

"అర్ధశేరు ఉప్పు అప్పివ్వడంలేదు" అన్నాడొకాయన.

మొన్న ఒకాయన రిక్షా దిగి డబ్బులిచ్చి ఇంట్లోకి వస్తున్నాడు. రిక్షాదారుడు "ఇంకో అయిదుపైసలివ్వండి" అన్నాడు.

"చిల్లరలేదు నాయనా నిజానికి నీకెంత యిచ్చినా ఋణం లేదు. సజీవంగా సహధర్మచారిణి ఎదుట దింపావు" అన్నాడు.

గుమ్మంలో నుంచున్న భార్య "అవేం మాటలండీ నే వినగలననేనా?" అంది.

"వినాలి మరి. కలికాలం. ఇది నిత్య యజ్ఞం. భగవంతుడు ఈ రోజుకి రక్షించాడు. లేకపోతే ఆ స్పీడుకి ఇల్లు చేరతాననుకున్నానా?" అంటూ లోపల ప్రవేశించాడు.

Post your comments